Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699


# రాజధాని వార్తలు

RAJADHANIVARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కాదే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 2 పేజీలు (Pages) : 4 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

బుధవారం, 25 - 6 - 2025

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 స్థాపితం : 2015


## నా మాటలు బీజేపీలో చేరడానికి సంకేతం కాదు



**న్యూఢిల్లీ:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇతర దేశాలతో సంబంధాలను బలపరచుకోవడంలో శక్తి, చైతన్యం ప్రదర్శించారంటూ కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ ఓ ఆంగ్ల పత్రికలో రాసిన వ్యాసం కాంగ్రెస్‌ను మరోసారి ఇరుకున పెట్టింది. శశిథరూర్ బీజేపీలో చేరనున్నారంటూ ఊహాగానాలు ఊపందుకున్నాయి. దీనిపై శశిథరూర్ తాజాగా స్పందించారు. తన వ్యాఖ్యలు ప్రధానమంత్రి పార్టీలో చేరడానికి ఎలాంటి సంకేతము కాదని వివరణ ఇచ్చారు. ఆపరేషన్ సింధూర్ విజయాన్ని వివరిస్తూ అన్ని పార్టీల ఐక్యతను ఆ వ్యాసంలో తాను ప్రస్తావించానని చెప్పారు. ఇతర దేశాలతో సంబంధాలను బలపరుచుకోవడంలో మోదీ శక్తి, చైతన్యం ప్రదర్శించారని తాను చెప్పానని, ఇది ఎంత మాత్రం బీజేపీ విదేశాంగ విధానమో, కాంగ్రెస్ విదేశాంగ విధానం గురించో కాదని, భారతదేశ విదేశాంగ విధానం గురించి మాత్రమేనని శశిథరూర్ తెలిపారు. పదకొండేళ్ల క్రితం పార్లమెంటు విదేశీ వ్యవహారాల కమిటీ చైర్మన్‌గా ఉన్నప్పుడు కూడా ఈ విషయం తాను చెప్పానని గుర్తు చేశారు. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ అనంతరం పాక్‌కు వ్యతిరేకంగా మొదలైన దౌత్యయుద్ధంలో భాగంగా ఏర్పాటుచేసిన ఏడు ఎంపీల బృందాల్లో ఒకదానికి శశిథరూర్ నాయకత్వం వహించారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత జరిగిన దౌత్య కృషి మన జాతీయ సంకల్పం, ప్రతిభావంతమైన వ్యక్తీకరణకు నిదర్శనంగా నిలిచిందని శశిథరూర్ తన వ్యాసంలో పేర్కొన్నారు. భారతదేశ ధృడ వైఖరిని ప్రపంచానికి చాటిచెప్పిందని తెలిపారు. ప్రధాని శక్తి, డైనమిజాన్ని ప్రశంసించారు. శశిథరూర్ వ్యాసాన్ని ప్రధానమంత్రి కార్యాలయం ట్వీట్ చేసింది.

## పార్టీలో క్రమశిక్షణ దాటితే వేటు తప్పదు.. నేతలకు సీఎం రేవంత్‌రెడ్డి స్ట్రాంగ్ వార్నింగ్

**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** మంత్రి పదవుల కోసం కొంత మంది కాంగ్రెస్ నేతలు ధర్నాలు చేయించడంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సీరియస్ అయ్యారు. పార్టీలో క్రమశిక్షణ దాటితే వేటు తప్పదని హెచ్చరించారు. పదవులు వచ్చినవారు తెలంగాణ రాష్ట్రమంతా తిరగాలని ఆదేశించారు. పదవులు అడగటం తప్పు లేదు.. కానీ నిరసన హుందాగా ఉండాలని సూచించారు. పీసీసీ కార్యవర్గంలో ఉన్న వారిని రెండుగా చేసి జాబితా సిద్ధం చేయాలని కోరారు. ముందు అందరికీ పని అప్పగించాలని ఆదేశించారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. పని చేసిన వాళ్లది ఒక జాబితా, పనిచేయని వాళ్లది మరో జాబితా సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్దేశించారు. ఇవాళ(మంగళవారం) గాంధీభవన్‌లో జరిగిన పీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. పని చేయకపోతే డిమోషన్.. పని చేస్తే ప్రమోషన్ ఇస్తామని స్పష్టం చేశారు. పని చేయకపోతే పక్కన పెట్టడంలో మొహమాటం అవసరం లేదని తేల్చిచెప్పారు. అలాగే ఇన్‌చార్జ్ మంత్రుల పనితీరుపై రేవంత్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో నామినేటెడ్ పదవులు భర్తీ చేసే బాధ్యత ఇన్‌చార్జి మంత్రులకు అప్పగించినా ఎందుకు చేయడం లేదని ప్రశ్నిచారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 99 శాతం గెలిచేలా ఇన్‌చార్జ్ మంత్రులే బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రులకు నిధులు ఇచ్చామని, వాటిని సరిగ్గా ఎందుకు ఉపయోగించడం లేదని ప్రశ్నల వర్షం కురిపించారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.




**పదేళ్లు అధికారం మనదే...**

'గతంలో నేను టీపీసీసీ చీఫ్ అయిన తర్వాత ఫ్రంటల్ ఆర్గనైజేషన్ చైర్మన్ బాధ్యతలు తీసుకోమంటే కొందరు తీసుకోలేదు. మేము సీనియర్లం, ఆ చిన్న బాధ్యత తీసుకోమని అన్నారు. ఆ రోజు బాధ్యత తీసుకున్న వారికి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కాగానే కార్పొరేషన్ పదవులు ఇచ్చాం. పార్టీ నిర్మాణంలో భాగస్వామ్యం అయితే పదవులు వాటంతట అవే వస్తాయని.. ఇంకో నాలుగు సంవత్సరాలు మన ప్రభుత్వం అధికారంలో ఉంటుంది. త్వరలోనే మహిళా రిజర్వేషన్ వచ్చే అవకాశం ఉంది. 2029 ఎన్నికలకు అందరూ సిద్ధంగా ఉండాలి. పార్టీలో పనిచేయని వారిని పదవుల నుంచి తొలగించాలి. తెలంగాణలో కాంగ్రెస్ రెండోసారి అధికారంలోకి రావాలంటే.. పార్టీ నేతల పనితీరుపైనే ఆధారపడి ఉంది. పదేళ్లు అధికారం మనదే. పార్టీ పదవిని చిన్న చూపు చూస్తే మీకే నష్టం. పార్టీ, ప్రభుత్వం జోడేదుల్లాలా గా పనిచేయాలి. 18 నెలల ప్రభుత్వ పాలన గోల్డెన్ పీరియడ్. బూత్, గ్రామ, మండల స్థాయిలో పార్టీ కమిటీలు ఏర్పాటు చేయాలి. బూత్ స్థాయిలో పార్టీ బలంగా ఉంటే ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి సమర్థ వంతంగా తీసుకెళ్లగలుగుతాం. పార్టీ నిర్మాణంపైన టీపీసీసీ దృష్టి సారించాలి. పార్టీ నాయకులంతా ఐక్యంగా పని చేయాలి' అని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు.

**నేతలు కలిసి పని చేయాలి..**

'మరోసారి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేలా నేతలు అందరూ కలిసి పని చేయాలి. పార్టీ కమిటీల్లో ఉన్న నాయకులు గ్రౌండ్ లెవెల్లో పని చేయాల్సిందే. పని చేస్తేనే పదవులు వస్తాయి. పార్టీ కష్టకాలంలో పనిచేసిన వారికి పదవులు ఇచ్చాం. లక్ష్యాన్ని నిర్దేశించుకొని పార్టీ నాయకులు పని చేయాలి. మార్కెట్ కమిటీలు, టెంపుల్ కమిటీల వంటి నామినేటెడ్ పోస్టులు భర్తీ చేసుకోవాలి. పార్టీ నాయకులు క్రమశిక్షణతో వ్యవహరించాలి. మన ప్రభుత్వం చాలా సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది. అనేక సామాజిక అంశాలను కూడా ప్రభుత్వం పరిష్కరించింది. రాబోయే రోజుల్లో చాలా సవాళ్లు ఎదుర్కొబోతున్నాం. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లు, జమిలి ఎన్నికలు లాంటి అంశాలు మన ముందుకు రాబోతున్నాయి. నేను గ్రామాల్లోకి వెళ్లడానికి సిద్ధంగా ఉన్నాను. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కోసం పార్టీని సిద్ధం చేయాలి' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

**ఇది గోల్డెన్ పిరియడ్ :**

కాంగ్రెస్ పార్టీ నిర్మాణం గురించి బూత్ స్థాయి నుంచి బలోపేతంపై చర్చించామని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఏడాదిన్నర కాలంగా నడుస్తోన్న ప్రభుత్వాన్ని గోల్డెన్ పీరియడ్‌గా భట్టి విక్రమార్క అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న సంక్షేమాన్ని గోల్డెన్ పీరియడ్‌గా జనంలోకి తీసుకెళ్లాలని పీఏసీలో నిర్ణయించామని అన్నారు. రుణమాఫీ, రైతు భరోసా, సన్నబియ్యం, రైతులకు బోనస్ వంటి వాటిపై ఈ సమావేశంలో చర్చించామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల కింద ప్రతి నియోజకవర్గంలో 4500 ఇండ్లు ఇస్తున్నామని ప్రకటించారు. 93 లక్షల కుటుంబాలకు సన్నబియ్యం అందజేస్తున్నామని వెల్లడించారు. ఏడాదిన్నరలో రూ.95,351 కోట్లు సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వ ఖర్చు చేసిందని మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

## పిల్లలతో కలిసి బావిలో దూకిన తల్లి.. ఇద్దరు మృతి

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** భార్యాభర్తల మధ్య జరిగిన వివాదంలో భార్య తీవ్ర మనస్తాపానికి గురైంది. దీంతో తన ఇద్దరి పిల్లలతో సహా ఆమె బావిలో దూకి ఆత్మహత్యాయత్నం చేసింది. విశాఖపట్నం జిల్లా పెందుర్తిలో జరిగిన ఈ సంఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. ఈ ఘటనలో తల్లి, కుమారుడు మరణించారు. బావిలో మెట్లు పట్టుకుని కుమార్తె ఉంది. దీంతో స్థానికులు వెంటనే బాలికను రక్షించారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని బావిలో నుంచి మృతదేహాలను వెలికి తీశారు. అనంతరం పోస్ట్‌మార్టం నిమిత్తం కేజీహెచ్ ఆసుపత్రికి తరలించారు. అయితే గత కొంత కాలంగా భార్యాభర్తల మధ్య ఘర్షణలు జరుగుతున్నాయని తమ దర్యాప్తులో తెలినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ కారణంగానే ఆమె విసిగిపోయి.. ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టిందని పోలీసులు వివరించారు. ప్రభుత్వం ఇటీవల తల్లికి వందనం పేరిట నగదును ఖాతాలో వేసింది. ఈ ఖాతాలోని నగదును తన ఖాతాలోకి మళ్లించాలంటూ భార్యపై భర్త తీవ్ర ఒత్తిడి చేశాడు. అందుకు ఆమె అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆ క్రమంలో ఇరువురి మధ్య ఇప్పటికే పలుమార్లు ఘర్షణ చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. గత అర్ధరాత్రి 3.00 గంటల సమయంలో సైతం వీరిద్దరి మధ్య ఘర్షణ జరిగింది. ఈ నేపథ్యంలో తన పిల్లలతో కలిసి ఆమె బావిలోకి దూకి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. అయితే ఈ ఘటనలో తల్లి, కుమారుడు మరణించడంతో స్థానికంగా విషాదం నెలకొంది. మరోవైపు ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ముగిసిన ఏపీ కేబినెట్ భేటీ.. కీలక నిర్ణయాలివే..




**అమరావతి, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన కేబినెట్ భేటీ ఇవాళ (మంగళవారం) ఏపీ సచివాలయంలో జరిగింది. ఈ భేటీలో పలు కీలక అంశాలపై సీఎం చంద్రబాబు మంత్రి మండలితో చర్చించారు. పలు అంశాలపై చర్చించిన తర్వాత మంత్రివర్గం ఆమోదం తెలపింది. మున్సిపల్ శాఖ ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రాజధాని రెండో విడత భూసేకరణను ఆమోదించింది. రాజధానిలో మరో 44 వేల ఎకరాల సేకరణకు మంత్రి మండలి నిర్ణయం తీసుకుంది. స్వర్ణాంధ్ర పి4పై త్వరలో కమిటీలు ఏర్పాటు చేయడానికి ఓకే చెప్పింది. టెన్నిస్ ప్లేయర్ సాకేత్‌కు గ్రూప్-1 ఉద్యోగం ఇవ్వాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. పోలవరం బనకచర్లపై తెలంగాణ నేతలు అందరూ మాట్లాడుతున్నారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. నిన్న (సోమవారం) తెలంగాణ కేబినెట్‌లో బనకచర్లపై వాళ్లు డిస్కస్ చేశారని అన్నారు. ఏపీ కూడా మన వాదనలు వినిపించాలని సూచించారు సీఎం చంద్రబాబు.

**తెలంగాణలో అనుమతి లేని ప్రాజెక్ట్‌లు..**

తెలంగాణ వాళ్లు అనుమతి లేని ప్రాజెక్టలను కూడా కడుతున్నారని సీఎం చంద్రబాబు గుర్తు చేశారు. ఇంకా చాలా ప్రాజెక్టలను వాళ్లు కడుతున్నారని తెలిపారు. తెలంగాణ వాడుకోగా మిగిలిన నీళ్లను మాత్రమే కదా ఏపీ వాడుకునేదని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. తెలంగాణ నేతలు బనకచర్లపై రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. వరద జలాలను మనం వాడుకుంటామని.. ఈ విషయాన్ని ప్రజలకు అర్థమయ్యే రీతిలో కూటమి నేతలు చెప్పాలని ఆదేశించారు. పోలవరం - బనకచర్ల ప్రాజెక్ట్‌పై మనం దశల వారిగా ముందుకు వెళ్తామని సూచించారు. ఆ తర్వాత కేంద్రప్రభుత్వం ఏం చెబుతుందో దాని ఆధారంగా మనం నిర్ణయం తీసుకుందామని వివరించారు. ఈ ప్రాజెక్టలు ఎప్పుడూ శంకుస్థాపన చేస్తామనేది త్వరగా నిర్ణయించాలని మంత్రి లోకేష్ అన్నారు. పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్ట్‌కి అవసరమైతే కేంద్ర ప్రభుత్వ జోక్యం కూడా అవసరమని సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ విషయం అర్థమయ్యేలా చెప్పేందుకు అవసరమైతే కేంద్రం ద్వారా ఓ సమావేశం ఏర్పాటు చేద్దామని చెప్పారు. సున్నితమైన పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్ట్‌పై నేతలు పూర్తి అవగాహనతో జాగ్రత్తగా మాట్లాడాలని దిశానిర్దేశం చేశారు సీఎం చంద్రబాబు.

**రెవెన్యూ సమస్యల పరిష్కారం...**

రెవెన్యూ సమస్యలను ఏడాదిలోపు పరిష్కరించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఎక్కువగా రెవెన్యూ సంబంధిత సమస్యలు వస్తున్నాయని చెప్పుకొచ్చారు. అన్నక్యాంటీన్లను ప్రతి నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేయాలని నిర్దేశించారు. అన్న క్యాంటీన్లను మానిటర్ చేయడానికి, ఎవరైనా విరాళాలు ఇస్తే తీసుకోవడానికి ఒక కమిటీని వేయాలని చంద్రబాబు సూచించారు. అనకాపల్లిలో ఆర్సెల్ మిట్టల్ స్టీల్‌కు సెప్టెంబర్‌లో శంకుస్థాపన చేసే విధంగా చూడాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పిస్తున్నామని చెప్పుకొచ్చారు. జాతీయ స్థాయిలో కొన్ని పంటలకు డిమాండ్ లేకపోవడంతో మనం మార్కెట్‌లోనే కొంటున్నామని స్పష్టం చేశారు. పొగాకుకు మార్కెట్‌లో ధర తక్కువగా ఉండటంతో రూ. 250 కోట్లు కేటాయించామని అన్నారు. పొగాకును మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తున్నామని పేర్కొన్నారు సీఎం చంద్రబాబు.

**మంత్రులకు కీలక సూచనలు..**

ధరల స్థిరీకరణ నిధి ద్వారా పొగాకు, మామిడి, కోకో పంటల రైతులను ఆదుకుంటున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. తేమ శాతం ఎక్కువ ఉందనే కారణంతో పొగాకుకు మార్కెట్‌లో డిమాండ్ తక్కువ ఉన్నా మనం చొరవ తీసుకుని రైతులను ఆదుకుంటున్నామని అన్నారు. చేసిన మంచిని చెప్పుకోవటంలో మంత్రులు, ఎమ్మెల్యేలు ఎందుకు విఫలమవుతున్నారని ప్రశ్నించారు. రైతుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని వివరిస్తూనే ప్రత్యామ్నాయ పంటల వైపు రైతును ప్రోత్సహించాలని సూచించారు. డిమాండ్‌కు తగ్గట్లుగా వాణిజ్య పంటలు వేసేలా రైతులను చైతన్య పరచాలని అన్నారు. ధరల స్థిరీకరణ నిధి ద్వారా పొగాకును ఇంత పెద్దమొత్తంలో కొనుగోలు చేయటం దేశ చరిత్రలో ఇదే ప్రథమమని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు. వాణిజ్య పంటలని కొనుగోలు చేసింది కూడా ఏపీనేనని గుర్తుచేశారు. ప్రజలకు ఈ విషయం మాత్రం ఎందుకు చెప్పుకోలేకపోతున్నామని నేతలను అడిగారు. అమరావతిలో వివిధ కార్యక్రమాల నిర్వహణకు ప్రభుత్వ పరంగా కన్వెన్షన్ కేంద్రం ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. రాష్ట్రంలో 6497 మినీ అంగన్‌వాడీ కేంద్రాలను అంగన్‌వాడీ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేస్తామని అన్నారు. టెంపుల్ టూరిజంతో పాటు ఏపీలో పర్యాటక అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మచిలీపట్నం బీచ్ ఫెస్టివల్ సక్సెస్‌పై నేతలను సీఎం చంద్రబాబు ప్రశంసించారు. ఈ తరహా కార్యక్రమాలు పెద్దఎత్తున నిర్వహిస్తూ రాష్ట్రంలో పర్యాటకాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు ముఖ్యమంత్రి చంద్రబాబు.

**ఏడాది పాలనను వివరించాలి..**

సీఆర్డీఏ పరిధిలో కొత్తగా తీసుకునే భూముల్లో ప్రభుత్వానికి సంబంధించి... 2019కు ముందు ఆరేళ్ల అనుభవ దారు ఎవరు ఉంటారో వారికే నష్టపరిహారం ఇవ్వాలని సీఎం చంద్రబాబు సూచించారు. జిల్లా స్థాయిలో ఏడాది పాలనపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి సమావేశం పెట్టాలని కోరారు. నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యేలు ఏడాది పాలనపై సమావేశాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశాల్లో ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించాలని చెప్పారు. ఈ నెలాఖరులోపు ఈ సమావేశాలు నిర్వహించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. జులై 1వ తేదీ నుంచి ఏడాది పాలనపై ఎమ్మెల్యేలు ఇంటింటికీ తిరిగి వివరించాలని నిర్దేశించారు సీఎం చంద్రబాబు. కూటమిలోని అన్ని పార్టీల నేతలను కలుపుకొని ముందుకు వెళ్లాలని కోరారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వాళ్లు రాజధానిలో లా యూనివర్సిటీ ఏర్పాటు చేయడానికి సంబంధిత భూమి వాళ్లకు లీజ్‌కు ఇవ్వాలని మంత్రి మండలి నిర్ణయం తీసుకుంది. బిల్డింగ్ రూల్స్‌ను మరింత సరళతరం చేయాలని కేబినెట్ నిర్ణయించింది. గుజరాత్‌లో మాదిరిగా బిల్డింగ్ రూల్స్‌ను సరళతరం చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. రాజధాని అమరావతిలో కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటుకి వెంటనే ప్లాన్ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు.

## అమరావతి అభివృద్ధికి మీ అభిప్రాయం చెప్పండి.. ప్రజలకు సీఆర్డీఏ వినతి

**అమరావతి, (రాజధాని వార్తలు):** అమరావతి అభివృద్ధి విషయంలో ప్రజల నుంచి సీఆర్డీఏ సలహాలు, సూచనలు కోరింది. ఏపీ సీఆర్డీఏ విజన్ 2047 పేరుతో ఆన్‌లైన్‌లో ప్రశ్నావళి రూపొందించింది సీఆర్డీఏ. విజన్‌లో అమరావతి ప్రాంత ప్రజలు భాగస్వామ్యులై తమ ఆలోచనలు, సూచనలు ప్రాధాన్యతలు, అభిప్రాయాలు చెప్పాలని విజ్ఞప్తి చేసింది. 8600 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో దేశంలోనే అతి పెద్ద ప్రణాళిక ప్రాంతంగా అమరావతి ఉందని సీఆర్డీఏ వెల్లడించింది. కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ఏలూరు జిల్లాల్లోని 56 మండలాల పరిధిలో విస్తరించినట్లు తెలిపింది. మంగళగిరి, తాడేపల్లిలాంటి పట్టణాలతో పాటు 900 గ్రామాలున్న ప్రాంతమని పేర్కొంది. సీఆర్డీఏ విజన్ 2047పై పలు ప్రశ్నలు వేస్తూ సమాధానాలు ఇవ్వాల్సిందిగా ప్రజలను సీఆర్డీఏ అభ్యర్థించింది. కాగా.. ఏపీ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న అమరావతి రాజధాని నిర్మాణాన్ని సీఆర్డీఏ ద్వారా నోడెల్ ఏజెన్సీగా నిర్మిస్తోంది. అమరావతి నిర్మాణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇతర అంశాలకు సంబంధించి ప్రజల నుంచే సూచనలు, సలహాలు కోరేందుకు సీఆర్డీఏ ఓ లింక్‌ను రూపొందించింది. దానికి సంబంధించి ఓ ప్రశ్నావళిని కూడా సిద్ధం చేసింది. విజన్ 2047 ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంతం అనే విధంగా ప్రశ్నావళిని తయారు చేసింది. అమరావతి నిర్మాణం ఏ విధంగా ఉండాలని, పర్యావరణం ఎలా ఉండాలి వంటి అంశాలపై ప్రశ్నలను సిద్ధం చేసింది. ముందుగా సీఆర్డీఏ ప్రాంతానికి చెందినవారా?.. ఇతర రాష్ట్రాలకు చెందినవారా? లేక విదేశాల్లో ఉంటున్నారా అనే అంశాన్ని ఓ ప్రశ్నగా ఇచ్చారు. ఆపై ఏపీ రాజధాని ప్రాంతానికి మొదటి మూడు ప్రాధాన్యతలు ఏంటి అంటూ మరో ప్రశ్న సంధించారు. వీటితో పాటు రాజధాని ప్రాంత ఆర్థిక వృద్ధికి వీటిలో ఏ అంశాలు ప్రధానంగా తీసుకోవాలి.. పరిశ్రమల అభివృద్ధా? వ్యవసాయమా? అంటూ రకరకాల ఆప్షన్స్ ఇస్తూ.. పది నుంచి పన్నెండు వరకు ప్రశ్నలను ప్రజలకు సీఆర్డీఏ సంధించింది. దీనికి సంబంధించిన లింక్‌ను రాష్ట్ర ప్రజలందరికీ కూడా చేరవేసే ప్రక్రియను సీఆర్డీఏ మొదలుపెట్టింది. అమరావతిలో పర్యావరణం, ఆర్థికపరమైన అభివృద్ధి తదితర అంశాలపై ప్రజల నుంచి వచ్చిన సూచనలు, సలహాల మేరకు ముందుకు వెళ్లాలని సీఆర్డీఏ భావిస్తోంది. గతంలో మాస్టర్ ప్లాన్‌ను రూపొందించిన తర్వాత బిల్డింగ్‌లకు సంబంధించి ప్రజల నుంచి సూచనలు, సలహాలు తీసుకున్న విషయం తెలిసిందే.



# డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్





**బుచ్చిరెడ్డిపాలెం, (రాజధాని వార్తలు):** డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్‌ను బుచ్చిరెడ్డిపాలెం అర్బన్‌ను భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు రామిశెట్టి కళ్యాణ్ కుమార్ ఆధ్వర్యంలో బుచ్చి రెడ్డిపాలెంపాలెం అర్బన్‌లోని శక్తి కేంద్రంలో బిజెపి నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి, బుచ్చిరెడ్డిపాలెం అర్బన్ ఇన్‌చార్జ్ గడ్డం విజయ్ కుమార్ పాల్గొన్నారు. డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలవేసి, పూలు జల్లిన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు, మాజీ ఎంపీటీసీ మెంబర్ రామిశెట్టి రమణమ్మ, జిల్లా కార్యదర్శి కాసా శ్రీనివాసులు, బుచ్చిరెడ్డిపాలెం అర్బన్ పూర్వ అధ్యక్షులు రాంశెట్టి మోహన్ బాబు, సీనియర్ నాయకులు కొప్పోలు మస్తానయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు మాచవరం శ్రీనివాసులు, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మహిమలూరు ప్రవీణ్ కుమార్, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు పార్లపల్లి మహేష్ నాయుడు, ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు గోళ్ళ నరసింహులు, బుచ్చిరెడ్డిపాలెం అర్బన్ ఉపాధ్యక్షులు యరాసి రామారావు,కోణం శ్రీనివాసులు, అర్బన్ కార్యదర్శి బొందిలి శాలిని రాణి, బీజేవైఎం అర్బన్ అధ్యక్షుడు తానా మణికంఠ, బీజేవైఎం నాయకులు మహిమలూరు శ్రీనివాసులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# భారతీయ జన సంఘ వ్యవస్థాపకులు శ్యాం ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి

## - బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు బత్తల కృష్ణయ్య



**చేజర్ల, (రాజధాని వార్తలు):** భారతీయ జన సంఘ వ్యవస్థాపకులు శ్యాం ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా చేజర్ల మండల భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో శ్యాం ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలవేసి ఆయనకు ఘనంగా బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల కిష్టయ్య బిజెపి నాయకులు కార్యకర్తలతో కలిసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సోమవారం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమమునకు బిజెపి కిషన్ మోర్చా రాష్ట్ర నాయకులు కుంకు బాలయ్య నాయుడు ముఖ్య అతిథిగా వచ్చి శ్యాం ప్రసాద్ ముఖర్జీ పార్టీకి చేసిన సేవలు గురించి తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు గుండాల విజయ భాస్కర్ రెడ్డి బిజెపి జిల్లా నాయకులు ఈఎంసి జగ్గారెడ్డి బిజెపి మండల ఉపాధ్యక్షులు కోటేశ్వర్ రెడ్డి బిజెపి మండల ఉపాధ్యక్షులు లాలి వెంకటయ్య బిజెపి జయ రామయ్య బిజెపి మండల ఉపాధ్యక్షులు దాసరి హజరత్ అయ్యా బిజెపి నాయకుడు తెల్లపాటి వెంకటరమణ నాయుడు ఆర్ ఎస్ మండల నాయకులు కూరపాటి కృష్ణారెడ్డి మరియు కొందరు బిజెపి కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# భవిష్యత్తులో మరింతగా ఉడ్ కాంప్లెక్స్‌ను అభివృద్ధి చేస్తాం

## - ఉడ్ కాంప్లెక్స్ అభివృద్ధి దశాబ్దాల కల - ఆ కల నేడు తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వంలో నెరవేరింది : ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** 26వ డివిజన్ ఉడ్ కాంప్లెక్స్‌లో 1.50 కోట్ల రూపాయలతో నిర్మించిన సీసీ డ్రైన్లను నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మరియు టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఆటో నగ ర్‌ను ఏవిధంగా అభివృద్ధిలో తీర్చిదిద్దామో అదేతరహాలో ఉడ్ కాంప్లెక్స్‌ను అభివృద్ధి చేస్తాం అని తెలిపారు. వ్యాపారస్తులు స్వచ్ఛందంగా ఉడ్ కాంప్లెక్స్ అభివృద్ధికి సహకరించారు. త్వరలో ఉడ్ కాంప్లెక్స్‌లో రోడ్లను కూడా పూర్తి చేస్తాం అని అన్నారు. ఈ సంవత్సర కాలంలో నెల్లూరు రూరల్ అభివృద్ధికి ఎనలేని సహకారం అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి నెల్లూరు రూరల్ నియోజకవర్గ ప్రజలపక్షాన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. పై కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బూడిద సుప్రజ, క్లస్టర్ ఇంచార్జ్ మన్నెం పెంచల నాయుడు, కో క్లస్టర్ ఇంచార్జ్ ఎల్.పి.కృష్ణా రెడ్డి, 26వ డివిజన్ అధ్యక్షులు బూడిద పురుషోత్తం యాదవ్, టీడీపీ నాయకులు శివాచారి, గౌస్ బాషా, మల్లెబోయిన వెంకటేశ్వర్లు యాదవ్, జహీర్, జావీద్, మాధవి, రఫి, శంకర్, కాలేషా, ఎజాస్, కృష్ణా రెడ్డి, నరసింహ ముదిరాజ్, రాజేష్, రాజు, సర్దార్, నస్రు, జుబేర్, కుమార్, కార్తీక్, బాబు, చాంద్ బాషా, హుస్సేన్, సమీర్, సల్మాన్, నాగమణి, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరులో ప్రశాంత వాతావరణం తీసుకు రండి

## - క్రిమినల్ యాక్టివిటీస్‌ని కంట్రోల్ చేసి శాంతిభద్రతలు కాపాడండి : జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ - సామాజిక మాధ్యమాలలో అసాంఘిక పోస్టులను, దుర్భాషలాడటం కట్టడి చేయండి





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** గత సంవత్సరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నెల్లూరుని పోలీసు వ్యవస్థ కట్టుదిట్టం చేసినప్పటికీ ఇంకా కొన్ని అసాంఘిక కార్యక్రమాలు కట్టడ చేయాలి అని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం అడిషనల్ ఎస్పీకి గ్రీవెన్స్‌లో జనసేన నాయకులు నూనె మల్లికార్జున్ యాదవ్, తదితరులు ప్రజా సమస్యల గురించి ఫిర్యాదు చేశారు. అడిషనల్ ఎస్పీ సౌజన్య సానుకూలంగా స్పందించి గతంలో ప్రశాంతంగా ఉండాల్సిన నెల్లూరులో ప్రశాంత వాతావరణం తిరిగి తెచ్చేందుకు మా సాయశక్తుల కృషి చేస్తున్నామని, చట్టా వ్యతిరేక కార్యక్రమాలు, అసాంఘిక కార్యక్రమాలు,ఉపేక్షించబోమని, రోహింగ్యాల గురించి సమస్యల గురించి సమీక్ష చేస్తామని తెలిపారు. రౌడీషీటర్లను గంజాయి బ్యాచ్ లను అసాంఘిక కార్యక్రమాలపై ఉక్కుపాదం మోపుతామని ప్రజల శాంతి భద్రతను ముఖ్యమని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో ఐ టి కోఆర్డినేటర్ శివకృష్ణ, జనసేన నాయకులు బెల్లపు సుధామాదవ్, 1వ డివిజన్ నాయకులు పవన్ యాదవ్, 13వ డివిజన్ పేనేటి శ్రీకాంత్, రాజేష్,వెంకట్ యాదవ్, జిల్లా సంయుక్త కార్యదర్శి ప్రశాంత్ గౌడ్, ఋషి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అనూప్ రెడ్డి జన్మదిన వేడుకలు






**బుచ్చిరెడ్డిపాలెం, (రాజధాని వార్తలు):** కోవూరు మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అత్తిపల్లి అనూప్ రెడ్డి జన్మదిన వేడుకలు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో యువజన విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కోవూరు మండల జడ్పిటిసి సభ్యురాలు కవర గిరి శ్రీలత, యువజన విభాగం అధ్యక్షులు మల్లవరపు చిరంజీవి హాజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం పేద ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల, పరిష్కరించడంలో అనూప్ రెడ్డి ముందుంటారని తెలియజేసినారు. నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి ఆశీస్సులతో, కోవూరు మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తల అభిమానంతో చిన్న వయసులోనే మండల పార్టీ బాధ్యతలు చక్కగా నిర్వహిస్తూ పార్టీకి మంచి పేరు తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నారని తెలిపినారు. అనూప్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయన ఎల్లవేళలా ఆయురారోగ్యాలతో ఉండాలని భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించినారు.ఈ కార్యక్రమంలో కిషోర్ రెడ్డి, సతీష్ రెడ్డి, సుబ్బారెడ్డి, వెంకటరమణారెడ్డి, హరి, రవి శ్రీనివాసులు, కృష్ణయ్య, జగన్, మోష రవికాంత్, వినయ్, షమీమ్, చోటే, అనూప్ రెడ్డి అభిమానులు, మిత్రులు శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

# విజయ డెయిరి ఉద్యోగుల వయోపరిమితి పెంపు : విజయ డైరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు విజయ డెయిరిలో పని చేస్తున్న సిబ్బంది ఉద్యోగ వయోపరిమితిని 58 సంవత్సరాల నుండి 60 సంవత్సరాలకు పెంచుతూ విజయ డెయిరి పాలక మండలి ఏకగ్రీవంగా తీర్మానం చేయడం జరిగింది. ఈ మేరకు సోమవారం వెంకటేశ్వరపురంలోని విజయ డెయిరి కార్యాలయంలో లిడెయిరి చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి అధ్యక్షతన డెయిరి పాలకమండలి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డెయిరిలో పనిచేస్తున్న సిబ్బంది ఉద్యోగ వయోపరిమితిని 58 సంవత్సరాల నుండి 60 సంవత్సరాల వరకు పెంచుతూ డెయిరి చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి తీసుకున్న నిర్ణయానికి పాలకమండలి సభ్యులు అందరూ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఉద్యోగ వయోపరిమితిని 60 సంవత్సరాల వరకు పెంచుతూ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిన డెయిరి చైర్మన్, బోర్డు సభ్యులకు డెయిరి సిబ్బంది ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసీ హర్షం వ్యక్తం చేశారు.



# రామలింగేశ్వరస్వామి ఆశీస్సులు అందరిపై ఉండాలి

## - వరిణిబిట్, 1సాగు నీటి సంఘ అధ్యక్షులు ఆవుల రవిచంద్ర

**విడవలూరు, (రాజధాని వార్తలు):** రామతీర్థములో జరుగుతున్న శ్రీకామాక్షి దేవి రామలింగేశ్వర స్వామిబ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం శివ పార్వతులు రథోత్సవంపై గ్రామంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా రామలింగేశ్వరస్వామి ఆశీస్సులు ప్రజ లపై ఉండి ఆయురారోగ్యాలతో బాగుండాలి అని వరిణిబిట్, 1సాగు నీటి సంఘ అధ్యక్షులు ఆవుల రవి చంద్రఆకాంక్షిచించారు. ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డిపాలనలో నియోజకవర్గం ప్రజలు సుభి క్షంగా ఉండారని రవి చంద్రఅన్నారు. ఈ కార్యక్రమం లో ఆలయ ఉత్సవ కమిటీ చైర్మెన్ అత్తిరాల సురేష్, సభ్యులు కటారి సుబ్ర హ్మణ్యం, కమిటీ సభ్యులు ఈ ఓ మల్లికార్జున రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ బెల్లంకొండ వెంకటేశ్వర్లు స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు యూరియా అందుబాటులోకి సొసైటీ అధ్యక్షులు గుండ్లపల్లి శ్రీనివాస యాదవ్





**సంగం, (రాజధాని వార్తలు):** రైతులకు యూరియా సొసైటీ కార్యాలయంలో అందుబాటులో ఉందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల సొసైటీ అధ్యక్షులు గుండ్లపల్లి శ్రీనివాస యాదవ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం రైతులతో ఆయన సమావేశం అయ్యారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ మండలంలోని కూటమి ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుందని తెలిపారు. అనంతరం సంగం సొసైటీ నందు రైతులకు యూరియా బస్తాలను ఆయన చేతుల మీద పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శశిధర్, తదితరులు పాల్గొన్నారు.

# ఫైనల్ కట్ రెడీ.. 3 గంటల పైనే రన్‌టైమ్




మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్‌గా రాబోతున్న సినిమా కన్నప్ప. ఇది కేవలం మరో పాన్ ఇండియా చిత్రం మాత్రమే కాకుండా, తెలుగు సినిమాకు ఓ ప్రెస్టిజియస్ విజువల్ ఎక్స్‌పీరియన్స్ కావడం గమనార్హం. ప్రాచీన భారతీయ ఇతిహాసాల నుంచి ప్రేరణ పొందిన ఈ సినిమా శ్రీకాళహస్తి శైవ భక్తుడైన కన్నప్ప జీవితాధారంగా రూపొందుతోంది. మైథలాజికల్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమా ఇప్పటికే అభిమానుల్లో భారీ అంచనాలు రేపుతోంది. ఇక తాజా సమాచారం ప్రకారం కన్నప్ప మూవీ ఫైనల్ కట్ పూర్తయ్యింది. ఈ సినిమా ఫైనల్ రన్‌టైం 3 గంటల 2 నిమిషాలు 51 సెకన్లు గా లాక్ అయిందట. అంటే సుమారు 182 నిమిషాల పాటు ఈ చిత్రం థియేటర్‌లో నడవనుంది. మామూలు కమర్షియల్ సినిమాలతో పోల్చితే ఇది చాలా ఎక్కువ రన్‌టైమ్. అయితే దర్శకులు, రచయితలు కథ నిడివిని కట్ చేయకుండా, భావోద్వేగాలకు పర్ఫెక్ట్‌గా చోటివ్వడానికే ఈలా డిసైడ్ చేసినట్టు సమాచారం. ఇక ఈ చిత్రంలో ప్రభాస్ కీలక పాత్రలో రుద్రుడిగా కనిపించనున్నారు. ఈ పాత్రకు సంబంధించిన సీన్స్ రెండో భాగంలో వస్తాయని, ఆయన స్క్రీన్ టైమ్ సుమారు 20 నిమిషాలు ఉంటుందని ఇప్పటికే విష్ణు క్లారిటీ ఇచ్చారు. అంతేకాదు ఇంటర్వెల్ తర్వాత 15 నిమిషాలకే ప్రభాస్ ఎంట్రీ ఉంటుంది అని తెలిపారు. ఈ పరిణామాల నేపథ్యంలో రన్‌టైమ్ ఎక్కువగా ఉన్నా, ప్రేక్షకులకు ఎక్కడా బోర్ అనిపించకుండా కథ నడుస్తుందన్న కాన్ఫిడెన్స్ టీమ్‌కు ఉంది. సినిమాకు సంబంధించిన పోస్టర్లు, టీజర్‌లు ఇప్పటికే బాగా హైప్ క్రియేట్ చేయగా, ఇటీవల జరిగిన ప్రీ-రిలీజ్ ఈవెంట్ కూడా సినిమాపై అంచనాలను పెంచింది.

విష్ణు చేసిన ఎమోషనల్ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ చిత్రానికి స్టీఫెన్ సంగీతం అందించగా, విజువల్ ప్రెజెంటేషన్‌లో హాలీవుడ్ స్టాండర్డ్స్‌ను ఫాలో అవుతున్నట్టు టాక్. మొత్తం మీద సినిమా ఎంత నిడివితో ఉన్నా, ఎమోషన్, విజువల్స్, డ్రామా కలిపి దాన్ని గ్రిప్‌ఫుల్‌గా మార్చడానికి దర్శకుడు ఎంతో కష్టపడ్డారని విష్ణు తెలిపారు. ఇక మోహన్ బాబు ఓ పవర్‌ఫుల్ పాత్రలో నటించనున్న ఈ చిత్రాన్ని 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ మరియు ఏవిఏ ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో విడు దల కానున్న ఈ సినిమా.. మన చారిత్రక భక్తిని నలుదిశలకి చాటే విధంగా ఉంటుందన్న నమ్మకం కనిపిస్తోందని మోహన్ బాబు తెలియజేశారు. మరి ఈ సినిమా ప్రేక్షకులను ఏ స్థాయిలో ఆకట్టుకుంటుందో చూడాలి.

# దీపిక, మృణాల్, జాన్వీ ఒకే ఫ్రేమ్‌లోనా?



ఐకాన్ స్టార్- అట్లీ సినిమాలో హీరోయిన్లు ఫైనల్ అయ్యారా? ముగ్గురు భామల ఎంపిక ప్రక్రియ పూర్త యిందా? అంటే అవుననే లీకులందుతున్నాయి. బన్నీ 22వ చిత్రం ముంబైలో అధికారికంగా ప్రారంభ మైన సంగతి తెలిసిందే. రెగ్యులర్ షూటింగ్ మొదలైందా? లేదా? అన్నది ఇంకా ఎలాంటి సమాచారం లేదు. అలాగే సిని మాలో హీరోయిన్లు ఎవరు ఎంపికయ్యారు? అన్నది కూడా రివీల్ చేయలేదు. అధికారి కంగా దీపికా పదు కొణే ఎంట్రీ ఒక్కటే ఖరారైంది. మరో ఇద్దరు నాయికలకు కథలో అవకాశం ఉండటంతో ఛాలా మంది భామల పేర్లే తెరపైకి వస్తున్నాయి. జాన్వీ కపూర్, శ్రద్ధా కపూర్, మృణాల్ ఠాకూర్, అనన్య పాండే ఇలా కొంత మంది పేర్లు తెరపైకి వచ్చాయి. కానీ తాజా సమాచారం ఏంటంటే? మరో ఇద్దరు నాయిల్ని కూడా మేకర్స్ ఖరారు చేసినట్లు తెలిసింది. మృణాల్ ఠాకూర్‌ని సెకెండ్ లీడ్‌కి, థర్డ్ లీడ్‌లో జాన్వీ కపూర్ ని ఎంపిక చేసినట్లు వినిపిస్తుంది. అట్లీ ఇద్దరిపై టెస్ట్ షూట్ నిర్వహించి ఎంపిక చేసాడుట. ఇదే నిజమైతే తెరంతా అందాల జాతరే. దీపిక, మృణాల్, జాన్వీ కపూర్ ఒకే ఫ్రేమ్‌లో కనిపిస్తే ఆ రచ్చ ఎలా ఉంటుందో ఊహకే అందదు.

ఇంత వరకూ ఈ త్రయం కలిసి నటించింది లేదు. వీళ్లిద్దరికంటే దీపిక సీనియర్. స్టార్ డమ్ పరంగానూ తిరుగులేని నాయిక. కానీ పెర్ఫార్మెన్స్‌లో మాత్రం మృణాల్ కి పోటీ కాదు. నటిగా మృణాల్ కే ఎక్కువ మార్కులు పడతాయి. జాన్వీ కపూర్‌తో పోలికి చేసినా? అదే పరిస్థితి. అందుకే మృణాల్‌ని సెకెండ్ లీడ్‌లో పెట్టినట్లు తెలు స్తోంది. కానీ క్రేజ్ పరంగా చూస్తే జాన్వీ కపూర్ కంటే ఓ మెట్టు కిందనే ఉంటుంది మృణాల్. మరి ఈ సినిమాలో ఈ ముగ్గుర్నీ అట్లీ ఎలా బ్యాలెన్స్ చేస్తాడు? అన్నది చూడాలి. హీరోయిన్లను అందంగా చూపించడంలో అట్లీ ఎక్స్ పర్ట్ కాదు. హీరోయిన్ల పాత్రలకు స్కోప్ పర్వాలేదు. మరీ పాటలకే పరిమితం చేయడం.

# ప్రేమలో మునిగితే, తికమక అవడం ఖాయం



గత కొన్నాళ్లుగా కోలీవుడ్ స్టార్ హీరో విజయ్, త్రిష కు సంబంధించిన వార్తలు సోషల్ మీడియాలో తెగ వినిపిస్తున్నాయి. విజయ్, త్రిష ఇద్దరూ రిలేషన్‌లో ఉన్నారని పుకార్లు బాగా వస్తున్నాయి. ఆ పుకార్లకు తగ్గట్టుగానే త్రిష రీసెంట్‌గా విజయ్ పుట్టినరోజున ఇద్దరూ కలిసి దిగిన ఓ స్పెషల్ ఫోటోను షేర్ చేస్తూ దానికి హగ్ ఎమోజీని జోడించి మరీ అతనికి విషెస్ తెలిపింది. అక్కడితో అయిపోలేదు. త్రిష షేర్ చేసిన ఆ ఫోటోకు ఆమె తల్లి కూడా లవ్ సింబల్స్‌ను యాడ్ చేసి ఇన్‌స్టాలో స్టోరీ పెట్టింది. దీంతో త్రిష, విజయ్ మధ్య ప్రేమ నడుస్తుంని అందరూ ఫిక్సై పోయారు. గత కొన్నాళ్లుగా వీరిద్దరూ డేటింగ్ చేస్తున్నారని పలుమార్లు మీడియాలో వార్తలొచ్చినప్పటికీ ఈ విషయంపై వారిద్దరూ ఎప్పుడూ ఖండించకపోవడం గమనార్హం. అయితే ఈ రూమర్లపై ఇప్పుడు త్రిష ఇన్‌డైరెక్ట్ గా రెస్పాండ్ అయింది. ఇన్‌స్టాలో త్రిష ప్రేమపై ఓ స్టోరీ పెట్టగా ఇప్పుడు ఆ స్టోరీ హాట్ టాపిక్‌గా మారింది. ప్రేమలో మునిగిపోతే, అది మిగిలిన అందరినీ తికమకకు గురిచేస్తుందని ఆ స్టోరీలో త్రిష పోస్ట్ చేసింది. త్రిష, విజయ్ ప్రేమలో ఉన్నారని వార్తలు ఎక్కువవుతున్న నేపథ్యంలోనే త్రిష ఈ స్టోరీ పెట్టిందని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. అయితే త్రిష, విజయ్ లవ్‌లో ఉన్నారనే వార్తలు ఇప్పుడు కొత్తగా పుట్టుకొచ్చినవి కాదు. ఎప్పట్నుంచో ఈ గాసిప్స్ వినిపిస్తూనే ఉన్నాయి. వీరిద్దరూ కలిసి ప్రయాణించడం, హీరోయిన్ కీర్తి సురేష్ పెళ్లికి గోవా వెళ్లడం కూడా ఆ వార్తలకు ఆజ్యం పోశాయి. త్రిష, విజయ్ కలిసి మొదటిసారిగా 2004లో గిల్లీ అనే సినిమాలో నటించగా, ఆ తర్వాత 2006లో ఆది అనే సినిమా చేశారు. రీసెంట్ గా లియో సినిమా చేయగా, గతేడాది విజయ్ నటించిన గోట్ సినిమాలో కూడా త్రిష స్పెషల్ సాంగ్ చేసింది. తన ఇన్నేళ్ల కెరీర్లో ఎప్పుడూ చేయని స్పెషల్ సాంగ్ కూడా త్రిష విజయ్ కోసమే చేసిందని వార్తలొచ్చిన సంగతి తెలిసిందే.

# కన్నప్ప స్టార్ ఫ్యాన్స్‌కి డైరెక్టర్ హామీ.. చివరి గంట అద్భుతం..!



మంచు విష్ణు డ్రీం ప్రాజెక్ట్‌గా తెరకెక్కిన కన్నప్ప సినిమా రిలీజ్‌కు ఇంకా మూడు రోజులు మాత్రమే ఉంది. అవా ఎంటర్టైన్మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్‌పై ఎం.మోహన్ బాబు నిర్మించిన సినిమా కన్నప్ప. ఈ సినిమాను ముఖేష్ కుమార్ సింగ్ డైరెక్ట్ చేశారు. సినిమా నుంచి ఇప్పటివరకు వచ్చిన ప్రమోషనల్ కంటెంట్ అంతా కూడా సూపర్ బజ్ ఏర్పరచింది. రిలీజ్ దగ్గర పడుతున్న టైంలో సినిమా దర్శకుడు ముఖేష్ కుమార్ సింగ్ మీడియాతో ముచ్చటించారు. సినిమా గురించి డైరెక్టర్ ముఖేష్ ఇంట్రెస్టింగ్ విశేషాలు పంచుకున్నారు. తాను తీసిన మహాభారతం సీరియల్ చూసి విష్ణు టీం తనకు కాల్ చేశారని చెప్పారు ముఖేష్ కుమార్ సింగ్. మహాభారతం తానొక్కడినే కాదు కొన్ని ఎపిసోడ్స్ నేను డైరెక్ట్ చేశా నాతో పాటు ఇంకా కొంతమంది దర్శకులు ఉన్నారని చెప్పానని అన్నారు. ఐతే ఆ తర్వాత ఆచారి అమెరికా యాత్ర సినిమా టైంలో అనూప్ ఠాకూర్ తన గురించి చెప్పారని అప్పుడు మళ్లీ విష్ణు టీం తనని అప్రోచ్ అయ్యారని చెప్పారు ముఖేష్ కుమార్ సింగ్. మంచు విష్ణు పిలుపు మేరకు హైదరాబాద్ వచ్చి కన్నప్ప కథ విన్నాను. అప్పటికి కన్నప్ప గురించి తనకు ఏమి తెలియదు. కానీ కథ చెప్పిన తర్వాత రీసెర్చ్ చేశానని అన్నారు ముఖేష్ కుమార్. ఆ తర్వాత మోహన్ బాబు గారు పిలిచి మహాభారతం సెరియల్ గురించి మాట్లాడి ఆ తర్వాత ఈ ప్రాజెక్ట్ గురించి చెప్పి డైరెక్టర్ గా తనను ఫైనల్ చేశారని ముఖేష్ కుమార్ సింగ్ వెల్లడించారు. బుల్లితెరపై తాను చేసిన ప్రాజెక్టులు అన్నీ కూడా హై బడ్జెట్‌తో చేశానని అన్న ముఖేష్ కుమార్ సింగ్. స్మాల్ స్క్రీన్, సిల్వర్ స్క్రీన్ ఎక్కడ పనిచేసినా ఒకే మైండ్ సెట్ తో పనిచేస్తానని అన్నారు ముఖేష్. ఇక కన్నప్ప సినిమా కోసం ప్రతి ఒక్కరు కూడా చాలా బాగా పనిచేశారని చెప్పారు. అక్షయ్ కుమార్, మోహన్ లాల్, ప్రభాస్, మోహన్ బాబు, విష్ణు, బ్రహ్మానందం ఇలా అందరితో పనిచేయడం ఒక మర్చిపోలేని అనుభూతి అని అన్నారు ముఖేష్. కన్నప్ప మీద ఇదివరకు వచ్చిన సినిమాలు చూశాను. ఇక విష్ణు గురించి చెబుతూ విష్ణు కన్నప్ప పాత్రకు వంద శాతం న్యాయం చేశారని చివరి గంట అద్భుతం అని అన్నారు దర్శకుడు ముఖేష్ కుమార్ సింగ్. సినిమా కోసం ఆర్ట్ డైరెక్టర్ కూడా చాలా రీసెర్చ్ చేశారు. ఎన్నో మ్యూజియంలను సందర్శించారని చెప్పారు. సినిమాలో క్యాస్టూమ్స్, వెపన్స్ ఇలా అన్నీ కూడా పరిశోధన చేసి సిద్ధం చేశామని అన్నారు. రెండో శతాబ్దం నాటి వాతావరణం తెర మీదకు తీసుకొచ్చే ప్రయత్నం చేశామని చెప్పిన ముఖేష్ కుమార్ అందుకు న్యూజిలాండ్ వెళ్లామని చెప్పారు. కన్నప్ప సినిమాలో ప్రభాస్ పాత్ర ఎంతో పవర్ ఫుల్ గా ఉంటుందని.. ఎవరి క్యారెక్టర్ కూడా ఇలా వచ్చి అలా వెళ్లేలా ఉండదని అన్నారు. అన్ని క్యారెక్టర్స్ ఆడియన్స్‌లో ప్రభావాన్ని చూపిస్తాయని చెప్పుకొచ్చారు. ఏ స్టార్ ఫ్యాన్స్ కూడా ఈ సినిమా చూసి నిరాశ చెందరని అన్నారు ముఖేష్. ఈ మూవీ ఇప్పటి వరకు చూసిన వాళ్లంతా అద్భుతం అనేస్తున్నారని వెల్లడించారు. కన్నప్ప మీద ఇదివరకు తీసిన సినిమాల్లో కాస్త లిబర్టీ తీసుకున్నారు. ఐతే ఇందులో కూడా ఫిక్షనల్ పార్ట్ ఉంటుంది. శ్రీకాళహస్తి అర్చకులకు సినిమా చూపించాం.. వాళ్లు మూవీ అద్భుతంగా ఉందని మెచ్చుకున్నారని ముఖేష్ కుమార్ సింగ్ చెప్పారు. కన్నప్ప అంటే ఇదేదో మైథలాజికల్ సినిమా అనుకుంటున్నారు. ఇది మన హిస్టరీ.. ఒక సంఘటనని ఒక్కొక్కరు ఒక్కోలా చెబుతారు. కన్నప్ప ఎవరికీ సరిగా తెలియదు. కన్నప్ప తన కంటిని శివుడికి ఇచ్చాడు.. ఇదంతా చరిత్ర అని అన్నారు ముఖేష్ కుమార్. ఇక చివరగా మహాభారతం సీరియల్ తీశాం కాబట్టి దాన్ని సినిమాగా తీయాలని అనుకుంటున్నట్టు వెల్లడించారు ముఖేష్ కుమార్ సింగ్. ఐతే మహాభారతం ఇప్పటికే రాజమౌళి తీద్దామని అనుకుంటున్నారు కదా అని డౌట్ రావొచ్చు. దానికి క్లారిటీ ఇస్తూ మహాభారతం పబ్లిక్ ప్రాపర్టీ.. అది ఎవరైనా తీసుకోవచ్చు.. రాజమౌళి గారు తీయొచ్చు.. అమీర్ ఖాన్ తీసుకోవచ్చు అంటూ చెప్పారు ముఖేష్ కుమార్ సింగ్.

# జోన్ 4 మిడ్ కాన్ 2025 లో జేసీఐ శ్రీకాకుళం సన్ రైజర్స్ హవా

## - వ్యక్తిగత అవార్డులతో మెరిసిన సిక్కోలు సేవకులు : జోన్ అధికారి జేసీ బగాది. ప్రవీణ్ కుమార్



**శ్రీకాకుళం, (రాజధాని వార్తలు):** వ్యక్తిగత అవార్డులతో జేసీఐ సిక్కోలు సేవకులకు అరుదైన ప్రశంసలు లభించాయని, జోన్ అధికారి జేసీ బగాది. ప్రవీణ్ కుమార్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జూనియర్ ఛాంబర్ ఆఫ్ ఇంటర్నేషనల్ జోన్ 4 మిడ్ కాన్ కార్యక్రమంలో భాగముగా జేసీఐ శ్రీకాకుళం సన్ రైజర్స్ వ్యక్తిగత అవార్డులతో పాటుగా, సన్ రైజర్స్ బృందానికి కూడా ప్రత్యేక అవార్డును సొంతం చేసుకుందని, అన్ని విభాగాలలో జేసీ సేవకులను గుర్తించి, ప్రశంసలందుకున్న జేసీఐ శ్రీకాకుళం సన్ రైజర్స్ సమూహానికి ప్రత్యేక అభినందనలన్నారు. అధ్యక్షులు జేసీ సింగూరు. ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో, ప్రతీ సభ్యుని సహకారంతో గడిచిన వేసవిలో సుమారు అరవై రోజులు ఏకధాటిగా ప్రజల దాహార్తిని తీర్చారని, యువతకు నాయకత్వ లక్షణాలు పెంపొందించే బాధ్యతను తీసుకున్నారని, మత్తు పదార్థాల వాడకం వలన కలిగే నష్టాలను, తమ అవగాహనా కార్యక్రమాల ద్వారా ప్రజలలో చైతన్యం తెచ్చారని, సిపిఆర్ పై ఆవాహన, అన్నదాన కార్యక్రమాలు చేశారని అధ్యక్షులు జేసీ సింగూరు. ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ సభ్యులందరి సహకారంతో కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, కార్యదర్శి సుదర్శన్ పట్నాయక్, కోశాధికారి ఐతం వెంకటేష్, ఇతర సభ్యుల బృందానికి ప్రత్యేక కృతజ్ఞతలన్నారు. ఉత్తమ లోకల్ ఆర్గనైజ్డ్ మెంబెర్, అధ్యక్షునిగా, ఉత్తమ కార్యదర్శిగా జేసీ సుదర్శన్ పట్నాయక్, ఉత్తమ సభ్యులుగా జేసీ వెంకటేష్ ఐతం, జేసీ జగదీశ్, ఉత్తమ మహిళా సభ్యురాలుగా జేసీ షర్మిల (ఉపాధ్యక్షురాలు), నూతన సభ్యునిగా జేసీ ఈశ్వర్. లోలుగు, బెస్ట్ కమ్యూనిటీ డెవలప్మెంట్ ఆక్టివిటీస్, బెస్ట్ పీఆర్ అండ్ మార్కెటింగ్, రక్తదాన శిబిరాలకు అవార్డులు లభించాయని, ముఖ్యంగా జేసీ గీత శ్రీకాంత్, జేసీ డా.వినోద్ కుమార్ కూర్మన అందించిన సహకారం మరువలేమని, భవిష్యత్ కార్యక్రమాలను కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సన్ రైజర్స్ వ్యవస్థాపకులు, జోన్ ట్రైనర్ సంతోష్ దూసి, ఇతర జేసీ సభ్యులు, శ్రీకాకుళం సన్ రైజర్స్ సభ్యుల బృందం పాల్గొన్నారు.

# సామాజిక వైద్య సేవల్లో అనుభవంతో చింతపల్లికి డా.సంతోష్

## - వైద్య సేవల వృద్ధికి నిస్వార్థంగా కృషి చేస్తానన్న నూతన సివిల్ అసిస్టెంట్ సర్జన్



**అల్లూరి జిల్లా, చింతపల్లి, (రాజధాని వార్తలు):** ప్రభుత్వ సాధారణ బదిలీల్లో భాగంగా చింతపల్లి ప్రాంతీయ ఆసుపత్రిలో జనరల్ మెడిసిన్ విభాగానికి సివిల్ అసిస్టెంట్ సర్జన్ వైద్యాధికారిగా సంతోష్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆరోగ్య శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు ఆయన వి. మాడుగుల మండలంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిగా విధులు నిర్వహించిన సంతోష్ తాజాగా బదిలీపై చింతపల్లి ఆసుపత్రిలో విధులు చేపట్టారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి సకాలంలో వైద్య సేవలు అందించడమే నా ప్రధాన లక్ష్యం. ప్రజల ఆరోగ్య పరిరక్షణకే నిస్వార్థంగా కృషి చేస్తాను అని ఆయన తెలిపారు. ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు కలిసి మిళితమై పనిచేసినప్పుడే మెరుగైన ఆరోగ్య సేవలు అందవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజల సహకారంతో ఆరోగ్య సేవల వృద్ధికి తనవంతు పాత్ర పోషిస్తానని ఆయన తెలిపారు.

# బదిలీలకు సీనియార్టీ, మెరిట్ ప్రమాణాలు తప్పనిసరి కావాలి

## - చింతపల్లిలో ఎంపీడీవోకు వినతిపత్రం సమర్పించిన గ్రామ సచివాలయ ఉద్యోగులు

**అల్లూరి జిల్లా, చింతపల్లి, (రాజధాని వార్తలు):** సాధారణ బదిలీలలో ఐదేళ్ల సేవ పూర్తి చేసిన గ్రామ సచివాలయాల ఉద్యోగులను సీనియార్టీ లేదా మెరిట్ ఆధారంగా కౌన్సిలింగ్ పద్ధతిలో బదిలీ చేయాలని కోరుతూ ఉద్యోగులు చింతపల్లి ఎంపీడీవో యు వి ఎస్ శ్రీనివాసరావుకు వినతిపత్రం సమర్పించారు. కూటమి ప్రభుత్వం ఐచ్ఛికాల పేరుతో తీసుకుంటున్న నిర్ణయాల వల్ల కొరుకున్న చోట బదిలీ రాకపోతుందన్న ఆందోళన ఉద్యోగుల్లో వ్యక్తమవుతోంది. ఉమ్మడి జిల్లాల స్థాయిలో కాకుండా ప్రస్తుత జిల్లాల ఆధారంగా ఉద్యోగుల సొంత జిల్లాలోని మండలాల్లోనే బదిలీలకు అవకాశం కల్పించాలంటూ వారు డిమాండ్ చేస్తున్నారు. జిల్లాల పునర్విభజన అనంతరం చాలామంది ఇతర జిల్లాలకు తరలి పోయినందున, వారికి తిరిగి సొంత జిల్లాలోని మండలాల్లో సేవలందించే అవకాశం ఇవ్వాలని అభిప్రాయపడ్డారు. అలాగే, వార్డు సచివాలయ ఉద్యోగులకు లభిస్తున్న విధంగా గ్రామ



సచివాలయ ఉద్యోగులకూ సొంత మండలాల్లోని ఇతర గ్రామ సచివాలయాల్లో బదిలీలకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశాలపై న్యాయం జరగాలన్న ఆశయంతో, ఎంపీడీవో ద్వారా అల్లూరి జిల్లా కలెక్టర్ దృష్టికి తమ విన్నపాలను తీసుకెళ్లాలని ఉద్యోగులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయాల ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రీముఖలింగం మహాక్షేత్రంలో నిత్యాన్నదాన పథకం లేదని భక్తులు గమనించాలి

## - ఆలయ ప్రధాన అర్చకులలో ఒకరు నాయుడు రాజశేఖర్

**శ్రీముఖలింగం, (రాజధాని వార్తలు):** దక్షిణ కాశీగా పేరొందిన శ్రీముఖలింగం మహాక్షేత్రంలో నిత్యాన్నదాన పథకం లేదని, ఈ విషయాన్ని భక్తులందరూ గమనించాలని, ఆలయ ప్రధాన అర్చకులలో ఒకరైన నాయుడు రాజశేఖర్ మంగళవారం అన్నారు. శ్రీకాకుళం స్థానిక ఎన్జీవో హోమ్‌లో మంగళవారం జరిగిన పత్రికా సమావేశంలో అర్చకులు నాయుడుగారి రాజశేఖర్ మాట్లాడుతూ శ్రీముఖలింగం దేవాలయంలో భక్తులకు నిత్యాన్నదానం తప్పితే, ఇతర సేవలు, వసతి సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, భక్తులు గమనించి నిత్యాన్నదానం పేరుతో ఎటువంటి విరాళాలు, ఆలయ ఈఓ, ఇతర కమిటీ సబ్యులకు గాని విరాళాలు అందించి మోసపోకూడదన్నారు. గత మూడేళ్ళుగా అన్నదానం పేరిట వసూళ్లు చేస్తున్నారని, ఆలయ ఈవోకు ఇదివరకు ఎన్నో సార్లు వివరించానని, ఇప్పటికీ ఆయన అండదండలతోనే కోట్లలో విరాళాలు అందుతున్నాయన్నారు. ఈ తతంగమంతా స్వామీ వారి పవిత్రతకు, భక్తుల మనోభావాలకు ఆటంకాలు కలిగించటమేనని, ఇప్పటికే నిత్యాన్నదానం పేరుతో కోట్లు వసూలు చేసి, అన్నవితరణలు మాత్రం చేపట్టలేదన్నారు. ఇప్పటికైనా భక్తులు గమనించి అన్నప్రసాద వితరణ పేరుతో విరాళాలు అందించవద్దని, స్వయంగా భక్తులు ఆలయానికి ఏదో ఒక రూపంలో ఆలయ ప్రాంగణంలో మాత్రమే సేవలందించాలన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఆఫ్ లైన్ టికెట్స్ అమ్మకం సరికాదని, ఇప్పటికైనా ఆన్లైన్ టిక్కెట్లను జారీ చేసి ఆలయ ప్రతిష్టతను ఇనుమడింపజేయాలన్నారు.



# ప్రతి ఇంటికి నీరు - మల్లవరం నుంచి నూతన ప్రయాణం



## - సర్పంచ్ పుష్పలత చేతుల మీదుగా బోరుబావి త్రవ్వకానికి శంకుస్థాపన

**అల్లూరి జిల్లా, చింతపల్లి, (రాజధాని వార్తలు):** జల జీవన్ మిషన్ కార్యక్రమం ద్వారా మల్లవరం గ్రామంలో కొత్త బోరుబావి త్రవ్వకానికి సోమవారం శంకుస్థాపన జరిగింది. ఈ కార్యక్రమాన్ని చింతపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ దురియా పుష్పలత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గ్రామంలో శుద్ధత గల తాగునీటి కొరత నివారణకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు అభినందనీయమని తెలిపారు. ప్రతి ఇంటికీ నీటి సరఫరా చేయాలనే లక్ష్యంతో చేపట్టిన జల జీవన్ మిషన్, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఉపకరిస్తుందని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువత, మహిళలు పాల్గొని ప్రభుత్వానికి, పంచాయతీకి కృతజ్ఞతలు తెలిపారు.



# మైలవరం టౌన్ అధ్యక్షుడిగా పాల నారాయణరెడ్డి ఎన్నిక

**మైలవరం, (రాజధాని వార్తలు):** మైలవరం టౌన్ గ్రామ కమిటీ అధ్యక్ష ఎన్నిక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహనరెడ్డి మైలవరం నియోజక వర్గ సమన్వయకర్త జోగి రమేష్ ఆదేశాల మేరకు మండల పార్టీ అధ్యక్షుడు గర్నెపూడి వెంకటరావు జిల్లా ఉపాధ్యక్షుడు పామర్తి శ్రీనివాసరావు, ఏఎంసి మాజీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డిల సమక్షంలో మైలవరం టౌన్ అధ్యక్షుడిగా పాల నారాయణరెడ్డిని తిరిగి ఎన్నుకోవటం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాకు ఈ అవకాశం కల్పించిన జోగి రమేష్‌కి మరియు పార్టీ పెద్దలకు మైలవరం టౌన్ నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు చెప్పారు.

# దివ్వా భూషణం ఆధ్వర్యంలో దుప్పట్లు, గొడుగులు పంపిణీ





**మాకమారపాలెం, (రాజధాని వార్తలు):** మాకమారపాలెం మండలం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వికలాంగుల విభాగం అధ్యక్షుడు దివ్వా భూషణం ఆధ్వర్యంలో జి.నగరంలో దుప్పట్లు, గొడుగులు పంపిణీ. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ శాసనసభ్యులు పెట్ల ఉమా శంకర గణేష్ హాజరవడం జరిగింది. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వికలాంగుల విభాగం అధ్యక్షుడైన దివ్వా భూషణం గారి కుమార్తె జన్మదినం సందర్భంగా మాకవరపాలెం మండలం 100 మందికి పైగా వికలాంగులకు మాజీ శాసనసభ్యులు పెట్ల ఉమా శంకర గణేష్ చేతులు మీదగా దుప్పట్లు గొడుగులు పంపిణీ చేయుడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంపీపీ సర్వేశ్వరరావు, మండల అధ్యక్షుడు చిటికెల రమణ, రుత్తల వాసు, పెట్ల భద్రాచలం, బండారు గాంధీ, బండారు గంగరాజు, డీవీన్ రాజు, పక్కుర్తి సత్యనారాయణ, పంపన రమేష్, ఎంపీటీసీలు సర్పంచులు మండల నాయకులు పాల్గొనడం జరిగింది.

# పీలా మహాలక్ష్మి నాయుడు 15వ వర్ధంతి సందర్భంగా నివాళులు

**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** అనకాపల్లి పట్టణం, గవరపాలెంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ & ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ శాసనసభ్యులు, నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ పీలా గోవింద సత్యనారాయణ తండ్రి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీపీ స్వర్గీయ పీలా మహాలక్ష్మి నాయుడు 15వ వర్ధంతి సందర్భంగా టీడీపీ నాయకులు వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు ఎంపీపీ గా ప్రాంతానికి మరియు పార్టీకి చేసిన సేవలను పెద్దలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు కర్రి వెంకట సన్యాసి నాయుడు (బాబీ), జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షులు షేక్ బాబర్, మాజీ సర్పంచ్ మేడిశెట్టి నూకరాజు, మాజీ ఎంపీటీసీ కోన శ్రీను, మోయ్యా నూకరాజు, నక్కా చెల్లయ్య, శిరసపల్లి షణ్ముఖ రాజు, కాండ్రేగుల చిన్నా, నాగరాజు, ఆళ్ళ జగన్, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.



Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan